నమస్తే తెలంగాణ
కరీంనగర్
5 | కరీంనగర్, శుక్రవారం 22 నవంబర్ 2024 | KARIMNAGAR

ట్యాంకర్ వద్ద నీటిని పట్టుకుంటున్న కాలనీవాసులు

వీర్నపల్లిలో తాగునీటికి ఇక్కట్లు

వీర్నపల్లి, నవంబర్ 21: రాజన్న సిరిసిల్ల జిల్లా వీర్నపల్లి మండలకేంద్రంలోని పద్మనగర్‌లో తాగునీటికి ఇక్కట్లు పడుతున్నారు. గ్రామ బస్టాండ్ వద్ద ఉన్న ట్యాంకు నుంచి ఇండ్లలోకి వచ్చే పైప్‌లైన్ కనెక్షన్ దూరం ఉండడంతో తొలగించి, కాలనీలోని రజక సంఘానికి చెందిన మోటర్ ద్వారా నీటిని అందిస్తున్నారు. అయితే ఆ మోటర్ 20 రోజుల నుంచి పనిచేయకపోవడంతో సమస్య తీవ్రమైంది. దీంతో పంచాయతీ అధికారులు నాలుగు రోజులకో ట్యాంకర్ పంపిస్తున్నారని, ఆ నీరు సరిపోవడం లేదని మహిళలు అగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దీంతో తామే నీటిని కొనుక్కొని ట్యాంకర్‌తో సరఫరా చేసుకుంటున్నమని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి నీటిని సరఫరా చేయాలని కోరుతున్నారు.

కరీంనగర్‌లోనే దీక్షా దివస్

- స్థలంపై పార్టీ త్వరలోనే నిర్ణయం
- మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్

కరీంనగర్‌లోని సుభాష్‌నగర్‌లో స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గంగుల కమలాకర్, మేయర్ సునీల్‌రావు, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీఆర్, నాయకులు

కరీంనగర్ కార్పొరేషన్, నవంబర్ 21 : తెలంగాణ రాష్ట్ర ఉద్యమంలో ఎంతో కీలకమైన దీక్షా దివస్ కార్యక్రమాన్ని ఈ సారి కరీంనగర్‌లోనే నిర్వహించాలని పార్టీ అధిష్టానం నిర్ణయించిందని ఎమ్మెల్యే గంగుల కమలాకర్ తెలిపారు. ఈ మేరకు గురువారం కరీంనగర్ పరిధిలోని అల్గునూర్ చౌరస్తా, సుభాష్‌నగర్‌లోని పలు స్థలాలను బీఆర్ఎస్ కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు, మేయర్ సునీల్‌రావుతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, తెలంగాణ ఉద్యమానికి పెట్టింది పేరు కరీంనగర్ జిల్లా అని స్పష్టం చేశారు. కేసీఆర్ ఉద్యమాన్ని కరీంనగర్ నుంచి చేపట్టారని, తీగలగుట్టపల్లిలోని కేసీఆర్ భవన్ నుంచి 'తెలంగాణ వచ్చుడో.. కేసీఆర్ చచ్చుడో' అన్న నినాదంతో ప్రారంభించారని గుర్తు చేశారు. 2009 నవంబర్ 29న కేసీఆర్ ఆమరణ నిరాహార దీక్ష కోసం వెళ్తుండగా అల్గునూర్ చౌరస్తాలో అరెస్టు చేయడంతో ఉద్యమం ఉవ్వెత్తున్న లేచి ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటు సాధ్యమైందన్నారు. ఈ రోజును తాము దీక్షా దివస్‌గా ప్రకటించుకున్నామని, ఈ దినోత్సవాన్ని కరీంనగర్‌లోనే నిర్వహించాలని పార్టీ అధిష్టానం నిర్ణయించిందని చెప్పారు. దీని కోసం స్థలాలను పరిశీలించామని, సుభాష్‌నగర్‌తోపాటు అల్గునూర్ చౌరస్తాల వివరాలను అధిష్టానానికి పంపిస్తామని తెలిపారు. పార్టీ నిర్ణయించిన తర్వాత ఏర్పాట్లు ప్రారంభిస్తామన్నారు. ఈ దీక్షా దివస్‌ను తెలంగాణకు చెందిన కవులు, కళాకారులు, ఉద్యమకారులు, ప్రజా ప్రతినిధులు, విద్యార్థులు, ప్రజా సంఘాల నాయకులు, మహిళలు, తదితరులతో గొప్పగా నిర్వహిస్తామని తెలిపారు. ఆయన వెంట బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్, కార్పొరేటర్లు కంసాల శ్రీనివాస్, నక్క పద్మ కృష్ణ, నాంపల్లి శ్రీనివాస్, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు, చిత్రంలో మున్సిపల్ చైర్ పర్సన్ మాధవి, జడ్పీ మాజీ చైర్‌పర్సన్ అరుణ, నాయకులు

మీరు నిర్లక్ష్యం చేస్తే మేం ప్రాజెక్టులు పూర్తి చేసినం

- మధ్యమానేరును గుండెకాయలా మార్చింది, మల్కపేట రిజర్వాయర్‌ను నిర్మించింది కేసీఆరే • రాజన్న ఆలయాన్ని అభివృద్ధి చేసింది ఆయనే • 16 శిలాఫలకాల్లో 12 బీఆర్ఎస్ చేసిన పనులవే • సీఎంకు ఇవన్నీ తెలువకపోవడం విడ్డూరం • బీఆర్ఎస్ వేములవాడ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు

వేములవాడ, నవంబర్ 21: పూర్తయిన ప్రాజెక్టులు కండ్ల ముందు కనిపిస్తున్నా పదేళ్ల పాలనలో ఒక్క ప్రాజెక్టు అయిన పూర్తి చేశారా..? అని సీఎం రేవంత్‌రెడ్డి ప్రశ్నించడం ఆయన అవివేక దృష్టికి నిదర్శనమని బీఆర్ఎస్ వేములవాడ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు విమర్శించారు. నాటి కాంగ్రెస్ పాలనలో పదిలేసిన పనులన్నింటినీ తొలి తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ పూర్తి చేశారని, మెట్ట ప్రాంతంలో ప్రతి ఎకరాకూ సాగునీరిచ్చి పచ్చగా మార్చారని కొనియాడారు. కానీ, రేవంత్ రెడ్డి అభివృద్ధి కోసం ఏం చేస్తారో చెప్పకుండా రాజన్న సన్నిధిలో ఎంతసేపూ కొడంగల్ జపం చేసి రాజకీయ విమర్శలకే పరిమితమయ్యారని, ఇదే మీ అసమర్థ పరిపాలనకు నిదర్శనమని మండిపడ్డారు. ఆయన కొడంగల్‌కు మాత్రమే ముఖ్యమంత్రి కాదని, ఈ రాష్ట్రానికి సీఎం అన్న విషయాన్ని మరిచిపోయారని ఎద్దేవా చేశారు. వేములవాడ పట్టణంలోని ఆయన నివాసంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వేములవాడ సభలో సీఎం రేవంత్ చేసిన వ్యాఖ్యలను ఖండించారు. మధ్యమానేరు ప్రాజెక్టు పనులను 2005లో ప్రారంభించి, 2009లో పూర్తి చేస్తామని అప్పటి సీఎం వైఎస్సార్ చెప్పారని గుర్తు చేశారు. అందులో కాంట్రాక్టర్‌గా ఉన్న కోమటి రెడ్డి రాజగోపాల్ రెడ్డి కూడా మధ్యలోనే పదిలేసి పారిపోయాడని ఎద్దేవా చేశారు. కానీ, 2014లో అధికారంలోకి వచ్చిన తర్వాత కేసీఆర్ మధ్యమానేరు జలాశయాన్ని పూర్తి చేసి రాష్ట్రానికే గుండెకాయలా మార్చారని ప్రశంసించారు. కాళేశ్వరం ప్యాకేజీ 9లో భాగంగా మల్కపేట రిజర్వాయర్‌ను నిర్మించి, ట్రయల్ రన్ చేసి ఒక టీఎంసీ నీటిని కూడా ఎత్తిపోసిన విషయం స్థానిక ఎమ్మెల్యేకు కూడా తెలువకపోవడం విడ్డూరమన్నారు. ఇంకా రెండు టీఎంసీల నీటిని ఎత్తిపోసే అవకాశమున్నా ఎందుకు నింపడం లేదని ప్రశ్నించారు. కుడి, ఎడమ కాలువలు కూడా దాదాపు పూర్తయ్యాయని, కొంత అక్కడక్కడ భూమి సేకరించాల్సి ఉందన్నారు. రిజర్వాయర్‌ను పూర్తిస్థాయిలో నింపితే సిరిసిల్లలో 42,300, వేములవాడలో 27,700 ఎకరాలకు, అలాగే రెండు నియోజకవర్గాల్లో చెరువులు, కుంటలు నింపితే 90వేల ఎకరాలకు నీరందుతుందని చెప్పారు. సింగసముద్రం పనులు అరకొరగా మిగిలి ఉన్నాయని చెప్పారు. అయినా కనీస జ్ఞానం లేకుండా మాట్లాడడం దురదృష్టకరమని అన్నారు.

> ఎన్నికల ముందు మధ్యమానేరు నిర్వాసితులందరికీ 5లక్షల 4వేలు ఇస్తామని రెచ్చగొట్టారు. ఇప్పుడు అబద్ధాలు మాట్లాడుతున్నారు. 10,600 మంది నిర్వాసితులుంటే అందులో 4,600 మందికే ఎలా ఇస్తారు? ఇది కూడా ఎగబెట్టే పథకమే. రేవంత్ కొడంగల్‌కు మాత్రమే ముఖ్యమంత్రి కాదు. ఈ రాష్ట్రానికి సీఎం అన్న విషయాన్ని మరిచిపోయారు. ఆయన ఎంతసేపూ అక్కడి ప్రాంత యువత గురించే మాట్లాడారు. కానీ, ఇక్కడి నిర్వాసిత యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించే విషయాన్ని మరిచారు. స్థానిక ఎమ్మెల్యే కూడా మాట్లాడలేదు. మంత్రులు కూడా ఇక్కడి ప్రజలకు ఎలాంటి వరాలు ఇవ్వలేదు. ఇదే మీ కపట ప్రేమకు నిదర్శనం.
>
> -చల్మెడ లక్ష్మీనరసింహారావు

కేసీఆర్ వచ్చాకే రాజన్న ఆలయ అభివృద్ధి

కేసీఆర్ అధికారంలోకి వచ్చిన తర్వాతనే వేములవాడ రాజరాజేశ్వరస్వామి ఆలయ అభివృద్ధి జరిగిందని స్పష్టం చేశారు. ఆలయాన్ని గత ప్రభుత్వం పట్టించుకోలేదని మాట్లాడిన రేవంత్ రెడ్డి, తాను దిగిన హెలీకాప్టర్ బండ్, నిర్వహించిన సభా స్థలం గత ప్రభుత్వం సేకరించిందనే విషయం ఆయనకు తెలువకపోవడం విడ్డూరమన్నారు. ఆలయ విస్తరణ పనుల్లో భాగంగా ₹30 కోట్లతో 32 ఎకరాలను సేకరించిందని, ₹70 కోట్లతో బండ్ నిర్మాణం చేపట్టిందని తెలిపారు. మరో ₹12 కోట్లతో సుందరీకరణ పనులు చేసిందని, నిత్యం రాజన్న ధర్మగుండం గోదావరి జలాలతో నిండుకుండలా ఉండేందుకు ₹17కోట్లతో మధ్యమానేరు నుంచి గుడి చెరువుకు లిఫ్ట్ కూడా వేసిందని గుర్తు చేశారు. నిత్యం రాజన్న భక్తులకు, స్వామివారి అభిషేకానికి కూడా ఇబ్బంది లేకుండా ₹5 కోట్లతో మిషన్ భగీరథ నీటిని అందించిందన్నారు. ₹17.50 కోట్లతో బద్దిపోచమ్మ ఆలయ విస్తరణ కోసం స్థలం సేకరించిందన్నారు. ఇవన్నీ రాజన్న ఆలయ అభివృద్ధిలో భాగం కాదా? అని ప్రశ్నించారు. ఆలయానికి ₹76 కోట్లతో శిలాఫలకం వేసిన రేవంత్ రెడ్డి, మాస్టర్‌ప్లాన్‌కు కావాల్సిన నిధులెన్ని? ఎప్పటిలోగా పూర్తి చేస్తారు? ఎన్ని విడుతల్లో నిధులు ఇస్తారనే స్పష్టత ఇవ్వకపోవడం ఆయన చిత్తశుద్ధిని బయట పెడుతున్నదని విమర్శించారు. 16 శిలాఫలకాలను ఆవిష్కరిస్తే, అందులో 12 గత ప్రభుత్వంలో చేసిన అభివృద్ధి పనులకే వేశారన్నారు. వెయ్యి కోట్ల అభివృద్ధి పనులని అబద్ధాలతో ప్రజలను నమ్మించలేరని వ్యాఖ్యానించారు. మంత్రులు మాట్లాడిన దానికి సీఎం మాట్లాడిన దానికి పొంతనే లేదని, ప్రజలు అన్నీ గమనిస్తున్నారని చెప్పారు. ఈ సమావేశంలో మున్సిపల్ చైర్ పర్సన్ మాధవి , జడ్పీ మాజీ చైర్‌పర్సన్ అరుణ, ఈగల రవీందర్ గౌడ్, సీనియర్ నాయకుడు ఏనుగు మనోహర్ రెడ్డి, సహకార సంఘం అధ్యక్షుడు నర్సయ్య యాదవ్, రామ్మోహన్ రావు, పార్టీ అధ్యక్షులు గోస్కుల రవి, మ్యాకల ఎల్లయ్య, మల్యాల దేవయ్య, ప్రధాన కార్యదర్శి కందుల క్రాంతి కుమార్, కౌన్సిలర్లు మారం కుమార్, నిమ్మశెట్టి విజయ్, నరాల శేఖర్, మాజీ ఎంపీపీ స్వరూపారాణి, నాయకులు రాఘవరెడ్డి, పొలాస నరేందర్, రామతీర్థపు రాజు, మాడిశెట్టి ఆనందం, వెంగళ శ్రీకాంత్ గౌడ్, ఈర్లపల్లి రాజు, నరాల దేవేందర్, అంజద్ పాషా, వాసాల శ్రీనివాస్ పాల్గొన్నారు.

తుపాకి రాముడు.. రేవంత్

- అబద్ధాలతో ప్రజలను మోసం చేస్తున్నడు
- కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావును తిట్టడమే పనిగా పెట్టుకున్నడు
- రామనామ జపంలా కేటీఆర్‌ను తలుస్తున్నడు
- ప్రభుత్వ వేదికపై రాజకీయ విమర్శలు చేస్తున్నడు
- ప్రభుత్వం ఎన్ని ఉద్యోగాలు ఇచ్చిందో చెప్పాలి
- సీఎం రేవంత్‌రెడ్డిపై మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ ఫైర్

కేసీఆర్‌ను విమర్శించడమే రేవంత్ పని

తెలంగాణ అభివృద్ధి ప్రధాత కేసీఆర్‌ను విమర్శించడమే లక్ష్యంగా రేవంత్ పని చేస్తున్నడు. వరంగల్ సభలో అత్యంత నీచంగా మాట్లాడిండు. రాష్ట్ర వ్యాప్తంగా అప్పుడే ముఖ్యమంత్రిపై వ్యతిరేకత మొదలైంది. వేములవాడ, సిరిసిల్ల నియోజకవర్గాల్లో బీఆర్ఎస్ హయాంలో అనేక ప్రగతి జరిగింది. మిడ్‌మానేరు నుంచి మల్కపేట, సింగసముద్రం వరకు కాలువ పనులు పూర్తి చేసినం. సాంకేతిక కారణాలతో నాడు ఆయా ప్రాజెక్టులను ప్రారంభించుకోలేకపోయినం. జిల్లాను అన్నింటా అగ్రగామిగా నిలిపిన ఘనత కేటీఆర్‌కే దక్కుతుంది. ప్రస్తుత వేములవాడ ఎమ్మెల్యే కోరిన పనులన్నీ తామే చేశామని రేవంత్ చెప్పడం విచారకరం. సోయి లేకుండా మాట్లాడుతున్నారు. ఇందిరమ్మ ఇండ్ల పేరుపై అక్రమాలు జరిగింది నిజం కాదా? ప్రజలకు ఇచ్చిన గ్యారెంటీలు అమలయ్యే వరకు బీఆర్ఎస్ పోరాడుతుంది.

- తోట ఆగయ్య, బీఆర్ఎస్ సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు

మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, పక్కన బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి గూడూరి ప్రవీణ్, పార్టీ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, పార్టీ పట్టణాధ్యక్షుడు జిందం చక్రపాణి, జడ్పీ మాజీ చైర్‌పర్సన్ అరుణ

సిరిసిల్ల టౌన్, నవంబర్ 21 : నిత్యం అబద్ధాలు చెబుతూ.. ప్రజల్ని మోసం చేస్తూ.. రాష్ట్రంలో సీఎం రేవంత్‌రెడ్డి తుపాకి రాముడిలా మారాడని చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ ఎద్దేవా చేశారు. ఉద్యమకారులపై గన్ను ఎక్కుపెట్టినోడు, కనీసం ఏ వేదికపైనా జై తెలంగాణ అని అనలేనోడు రాష్ట్రానికి ముఖ్యమంత్రి కావడం దురదృష్టకరమని వాపోయారు. వరంగల్ సభలో కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేస్తానని చెప్పిన ఆయన, వేములవాడ సభలో కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావును తిట్టడమే పనిగా పెట్టుకున్నారని, కేటీఆర్ పేరును రామనామంలా జపిస్తున్నారని విమర్శించారు. ప్రభుత్వ వేదికపై అభివృద్ధి గురించి మాట్లాడకుండా రాజకీయ విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. ఇప్పటికైనా కారు కూతలు మానుకొని చిత్తశుద్ధి ఉంటే ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. సిరిసిల్లలోని తెలంగాణ భవన్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రేవంత్‌రెడ్డి ప్రతి మాటకు కేటీఆర్‌ను జైలుకు పంపుతా అనడం విచిత్రంగా ఉందని, ప్రజల కోసం జైలుకు వెళ్లేందుకు సిద్ధంగా ఉన్నానని కేటీఆర్ ఎప్పుడో చెప్పారని గుర్తు చేశారు. నాటి కాంగ్రెస్ పాలనలో ఉరిశాలగా ఉన్న సిరిసిల్ల సిరిశాలగా మారడానికి కారణం కేటీఆర్ చేసిన కృషేనని ఉద్ఘాటించారు. మళ్లీ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన కొద్ది కాలంలోనే ఆత్మహత్యలు మొదలయ్యాయని ఆందోళన వ్యక్తం చేశారు. నాడు ఎడారి ప్రాంతంగా ఉన్న రాజన్న సిరిసిల్ల జిల్లాను కోనసీమగా మార్చింది తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ అని కొనియాడారు. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల ప్రాజెక్టులు కుప్పకూలిపోయాయని రాజన్న సాక్షిగా అబద్ధాలు చెప్పడం రేవంత్ సోయిలేని మాటలకు నిదర్శనమని చెప్పారు. ప్రాజెక్టులు కుప్పకూలిపోతే కొండపోచమ్మ, రంగనాయకసాగర్, మల్లన్నసాగర్‌కు నీళ్లు ఎట్లా వస్తున్నాయని, హెలీకాప్టర్‌లో వచ్చిన రేవంత్‌రెడ్డికి మిడ్‌మానేరు ప్రాజెక్టులోని నీళ్లు కనిపించలేదా? అని ప్రశ్నించారు. గతంలో రాజన్న మీద ప్రమాణం చేసి రైతులకు ₹2 లక్షలు రుణ మాఫీ చేస్తానని మోసం చేసింది రేవంత్ అని విమర్శించారు. ధార్మిక, ఆధ్యాత్మిక చింతన కలిగిన గొప్ప వ్యక్తి కేసీఆర్ నాయకత్వంలోనే వేములవాడ రాజరాజేశ్వరస్వామి ఆలయ అభివృద్ధి జరిగిందని స్పష్టం చేశారు. రేవంత్ సభ నిర్వహించిన గుడి చెరువు స్థలాన్ని బీఆర్ఎస్ సర్కారే సేకరించిందని, కట్టపై హెలీకాప్టర్ ఆగిన స్థలాన్ని అభివృద్ధి చేసిందని, పట్టణంలో సుందరీకరణ పనులు చేసిందని గుర్తు చేశారు. ఇవన్నీ తెలియకుండా విమర్శిస్తున్నారని మండిపడ్డారు. ఇటీవల యాదాద్రి ఆలయ అభివృద్ధిని చూసి రేవంత్‌రెడ్డి బిత్తిరి చూపులు చూశారని, ఆ మానసిక ఒత్తిడితోనే కేసీఆర్ విమర్శించడం మొదలు పెట్టారని ఎద్దేవా చేశారు. వేములవాడ సభా వేదికగా జిల్లాకు మెడికల్ కాలేజీ కాంగ్రెస్ ప్రభుత్వం మంజూరు చేసిందని అనడం హాస్యాస్పదంగా ఉందన్నారు. కేసీఆర్ ప్రభుత్వం ఇచ్చిన నోటిఫికేషన్లతో వచ్చిన ఉద్యోగాలను తామే ఇచ్చినట్లు చెప్పుకుంటున్న రేవంత్ వైఖరి చూస్తుంటే ఎవరికో బిడ్డను తనకే పుట్టినట్టు చెప్పుకుంటున్నట్లుందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో లక్ష 68వేల ప్రభుత్వ ఉద్యోగాలిచ్చామని గుర్తు చేశారు. రేవంత్ చెప్పినట్టు నియమించిన 50వేల ఉద్యోగులను ఎల్‌బీ స్టేడియంకు పిలిపించాలని, రాజన్న సిరిసిల్ల జిల్లా నుంచి తాము బహిరంగ చర్చకు వస్తామని సవాల్ విసిరారు. కాంగ్రెస్ నోటిఫికేషన్ ఇచ్చి, ఎంతమందికి ఉద్యోగాలు ఇచ్చిందో చెప్పాలని డిమాండ్ చేశారు. సమావేశంలో జడ్పీ మాజీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ, బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు జిందం చక్రపాణి, బీఆర్ఎస్ ముస్తాబాద్ మండలాధ్యక్షుడు సురేందర్‌రావు, దిడ్డి రాజు, దార్ల సందీప్, గుండ్లపల్లి పూర్ణచందర్, మ్యాన రవి, న్యాలకొండ రాఘవరెడ్డి, అడ్డగట్ల మురళి, ఎదురుగట్ల చంద్రయ్యగౌడ్, పోచవేని ఎల్లయ్యాదవ్, కుంబాల మల్లారెడ్డి, పాతూరి రాజిరెడ్డి, వీరగోని శ్రీనివాస్‌గౌడ్, సబ్బని హరీశ్, కంచర్ల రవిగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

నేతన్నల సంక్షేమంపై పట్టింపులేదు

వేములవాడకు వచ్చిన సీఎం రేవంత్‌రెడ్డిపై రైతులు, నేతన్నలు ఎన్నో ఆశలు పెట్టుకున్నరు. కానీ, వారికి నిరాశే మిగిలింది. సీఎంతోపాటు చేనేత జౌళీశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు సిరిసిల్లకు వచ్చి నేతకార్మికుల కుటుంబాల కష్టాలు తెలుసుకుంటే బాగుండేది. వేములవాడకు వచ్చి పక్కనే ఉన్న సిరిసిల్లకు రాకపోవడం చూస్తే నేతన్నల సంక్షేమంపై వారికి పట్టింపు లేదని అర్థమవుతున్నది. నేతన్నల ఆత్మహత్యలు జరుగుతున్నా కనీసం స్పందించకపోవడం బాధాకరం. గతంలో కేసీఆర్, కేటీఆర్ సిరిసిల్ల నేతన్నలతో సమీక్షించి బతుకమ్మ చీరల ఆర్డర్లు ఇప్పించారు. కానీ, ఇప్పుడు ఆర్డర్లు ఇస్తామంటూ కాలం ఎల్లదీస్తున్నారన్నారు. టెస్కోలో పని చేస్తున్న ఉద్యోగులు ఎంతోమందిని తొలగించారు. వేములవాడలో యారన్ డిపో ప్రారంభాన్ని వర్చువల్ విధానంలోనే నిర్వహించడం బాధాకరం. ₹50 కోట్ల ముడిసరుకు కొన్నామని చెప్పడం పూర్తిగా అవాస్తవం. గత ప్రభుత్వం పెట్టిన పావులా వడ్డీ, చేనేత మిత్ర, చేనేతకు చేయూత పథకాలను కొనసాగిస్తున్నామన్న మీకు వీటిపై కనీస అవగాహన ఉందా? చెప్పాలి.

- గూడూరి ప్రవీణ్, బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి

కరీంనగర్ టూ కాచిగూడ

ప్రత్యేక రైలు

మెట్‌పల్లి, నవంబర్ 21 : దక్షిణ మధ్య రైల్వే ఈ నెల 24, 25, 26, 28 తేదీల్లో కరీంనగర్ నుంచి కాచిగూడకు ప్రత్యేక రైలును నడుపనున్నది. రైలు (నెం:7103) కరీంనగర్ నుంచి ఉదయం 6 గంటలకు బయలుదేరి కోరుట్ల, మెట్‌పల్లి మీదుగా మధ్యాహ్నం 2 గంటలకు కాచిగూడకు చేరుకుంటుంది. అదే రోజు రైలు (నెం.7104) కాచిగూడ రైల్వేస్టేషన్ నుంచి మధ్యాహ్నం 3 గంటలకు బయలుదేరి మెట్‌పల్లి, కోరుట్ల మీదుగా రాత్రి 11.15 గంటలకు కరీంనగర్ చేరుకుంటుంది. ఈ అవకాశాన్ని ప్రయాణికులు వినియోగించుకోవాలని రైల్వే అధికారులు సూచించారు.

ఫీజు చెల్లించేందుకు డిసెంబర్ 3 ఆఖరు

కమాన్‌చౌరస్తా, నవంబర్ 21 : టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సుల్లో (టీటీసీ) లోయర్, హయ్యర్ గ్రేడ్ డ్రాయింగ్, టైలరింగ్, ఎంబ్రాయిడరీలో పరీక్షలు వచ్చే జనవరిలో ఉంటాయని, వచ్చే నెల 3వ తేదీలోగా పరీక్ష ఫీజు చెల్లించాలని డీఈవో జనార్దన్‌రావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. డ్రాయింగ్ లోయర్ గ్రేడ్‌కు రూ.100, డ్రాయింగ్ హయ్యర్‌కు రూ.150, టైలరింగ్, ఎంబ్రాయిడరీ లోయర్ గ్రేడ్‌కు రూ.150, హయ్యర్ గ్రేడ్‌కు రూ.200 పరీక్ష ఫీజు ఉంటుందని చెప్పారు. అపరాధ రుసుం రూ.50తో డిసెంబర్ 10 తేదీ వరకు, అపరాధ రుసుం రూ.75తో డిసెంబర్ 17వ తేదీ వరకు చెల్లించవచ్చని పేర్కొన్నారు. పరీక్ష రాసే అభ్యర్థులు 7వ తరగతి పాస్ అయి ఉండాలని, లోయర్ గ్రేడ్ పాస్ అయిన వారు హయ్యర్ గ్రేడ్ పరీక్షకు అర్హులని వివరించారు. వివరాలకు www.bse.telangana.gov.in చూడాలని సూచించారు.

వెంకన్న గుడికి అడుగులు

- కరీంనగర్‌లో వేంకటేశ్వర ఆలయ నిర్మాణంపై ఆశలు
- టీడీటీ చైర్మన్‌ను ప్రత్యక్షంగా కలిసి గంగుల విన్నపం
- సానుకూలంగా స్పందించిన చైర్మన్ నాయుడు
- అతి త్వరలో పనులు ప్రారంభిస్తామని హామీ

టీటీడీ బోర్డు చైర్మన్ నాయుడును కలిసి వినతిపత్రం సమర్పిస్తున్న ఎమ్మెల్యేలు గంగుల కమలాకర్, పాడి కౌశిక్‌రెడ్డి, డాక్టర్ కల్వకుంట్ల సంజయ్, మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, నాయకులు

కరీంనగర్ కమాన్ చౌరస్తా, నవంబర్ 21 : కరీంనగర్‌లో కలియుగ ప్రత్యక్ష దైవం వెంకన్న గుడిపై ఆశలు చిగురించాయి. వేంకటేశ్వరస్వామి ఆలయ నిర్మాణానికి మళ్లీ అడుగులు పడుతున్నాయి. ఇప్పటికే అట్టహాసంగా భూమిపూజ పూర్తయి, నిర్మాణం మొదలయ్యే సమయంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో పనుల ప్రారంభం ఆలస్యమైంది. దీంతో మళ్లీ భుజాన వేసుకున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్.. గుడి నిర్మాణం కోసం కదిలారు. అందులో భాగంగానే మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, హుజూరాబాద్, కోరుట్ల ఎమ్మెల్యేలు పాడి కౌశిక్‌రెడ్డి, డాక్టర్ సంజయ్ కల్వకుంట్లతో కలిసి హైదరాబాద్‌లో టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ నిర్మాణం కోసం తెలంగాణ తొలి ముఖ్యమంత్రి తీసుకున్న చొరవ, 10 ఎకరాల భూమి కేటాయింపు, అలాగే టీడీడీ బోర్డు ₹20 కోట్లు మంజూరు చేసిన విషయాన్ని వివరించారు. కరీంనగర్ ప్రజల చిరకాల వాంఛ అయిన వేంకటేశ్వరస్వామి దేవస్థానం నిర్మాణం చేపట్టాలని కోరారు. అందుకు పూర్తి సహకారం అందిస్తామని చెప్పారు. దీనికి చైర్మన్ స్పందించి దేవస్థానం నిర్మాణం వెంటనే చేపడుతామని చెప్పారని గంగుల తెలిపారు. ప్రథమ ప్రాధాన్యత కింద తీసుకుంటామని, అతి త్వరలోనే పనులు ప్రారంభిస్తామని హామీ ఇచ్చారని వివరించారు.

గతేడాది మేలో భూమి పూజ

కరీంనగర్ కేంద్రంగా ఉత్తర తెలంగాణ ప్రజలకు శ్రీ వేంకటేశ్వరుడి దర్శనం చేరువ చేయాలని బీఆర్ఎస్ ప్రభుత్వంలో సంకల్పించారు. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ కరీంనగర్‌లో పదెకరాల స్థలాన్ని టీటీడీ ఆలయానికి కేటాయించారు. స్థానిక ఎమ్మెల్యే, మాజీ మంత్రి గంగుల కమలాకర్, ఇతర బీఆర్ఎస్ నాయకుల కృషితో 2023 మే 31న వేదమంత్రోచ్ఛారణలతో టీటీడీ ఆలయ నిర్మాణానికి భూమిపూజ, శంకుస్థాపన కార్యక్రమం అత్యంత అట్టహాసంగా జరిపారు. అదే ప్రాంగణంలో సాయంత్రం అంగరంగ వైభవంగా శ్రీవారి కల్యాణోత్సవం నిర్వహించారు. అప్పుడు ఆనాటి టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి చేతులమీదుగా నిర్మాణ అనుమతి పత్రాలు అందజేశారు. ₹20 కోట్ల వ్యయంతో టీటీడీ ఆధ్వర్యంలో శ్రీవారి ఆలయాన్ని నిర్మించడానికి అన్ని ఏర్పాట్లూ చేశారు. కానీ, తర్వాత కాంగ్రెస్ ప్రభుత్వం రావడం, దీనిపై శ్రద్ధ చూపకపోవడంతో ఎవరూ పట్టించుకోలేదు. దీంతో మళ్లీ ఎమ్మెల్యే కమలాకరే భుజాన ఎత్తుకున్నారు. ఇటీవలే కొత్తగా నియమితులైన టీటీడీ బోర్డు చైర్మన్ నాయుడిని హైదరాబాద్‌లో కలిసి ఆలయం నిర్మించాలని కోరారు. దీంతో ఆయన సానుకూలంగా స్పందించారు.

మాట్లాడుతున్న మాజీ సర్పంచ్‌ల జేఏసీ సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు అక్కెనపల్లి కరుణాకర్

బందిపోట్ల లెక్క బంధించిన్రు

- సీఎంతో మాట్లాడిస్తామని రాత్రికి రాత్రే అరెస్ట్ చేయించిన్రు • కాంగ్రెస్ నేతలు నమ్మించి మోసం చేసిన్రు • మాజీ సర్పంచుల జేఏసీ సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు అక్కెనపల్లి కరుణాకర్

సిరిసిల్ల టౌన్, నవంబర్ 21: పెండింగ్ బిల్లుల కోసం పోరాటం చేస్తున్న మాజీ సర్పంచ్‌లను కాంగ్రెస్ ప్రభుత్వం అర్ధరాత్రి బలవంతంగా అరెస్టులు చేయించిందని, బందిపోటు దొంగల లెక్క బంధించిందని మాజీ సర్పంచుల జేఏసీ రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు అక్కెనపల్లి కరుణాకర్ మండిపడ్డారు. సిరిసిల్లలోని ప్రెస్‌క్లబ్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తమ సమస్యను వేములవాడ పర్యటనకు వస్తున్న సీఎం రేవంత్‌రెడ్డికి దృష్టికి తీసుకెళ్లేందుకు ప్రయత్నించామని, బిల్లుల విడుదలపై స్పష్టమైన ప్రకటన రాకపోతే టూర్‌ను అడ్డుకుంటామని పిలుపునిచ్చామన్నారు. అయితే కొంత మంది ప్రభుత్వ పెద్దలు పెండింగ్ బిల్లుల సమస్యను ముఖ్యమంత్రికి చెప్పుకునే అవకాశం కల్పిస్తామని చెప్పి తమకు ఎంట్రీ పాస్‌లు ఇప్పించారన్నారు. వారు ఇచ్చిన హామీతో సీఎం పర్యటనను అడ్డుకునే నిర్ణయాన్ని ఉపసంహరించుకున్నామని, ఆ మేరకు ప్రకటన కూ